గుత్తాసుఖేందర్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షల వెల్లువ

గుత్తా సుఖేందర్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న కేవీ రమేశ్‌రాజు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 2 : శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి 70వ జన్మదినం పురస్కరించుకుని శుక్రవారం లయన్స్‌క్లబ్ లయన్ కేవీ రమేశ్‌రాజు, ఇబ్రహీంపట్నం యూనియన్ బ్యాంకు మేనేజర్లు నగరంలోని ఆయన నివాసంలో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

జాతీయ అవార్డు గ్రహీతకు సన్మానం

హస్నాబాద్ గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికురాలు లక్ష్మిని సన్మానిస్తున్న ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్

కొడంగల్, ఫిబ్రవరి 2 : మండలంలోని హస్నాబాద్ గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికురాలు జాతీయ స్థాయిలో ఉత్తమ అవార్డును అందుకున్నది. ఈ సందర్భంగా శుక్రవారం ఎండీవో కార్యాలయంలో సర్పంచ్‌లకు జరిగిన సన్మాన కార్యక్రమంలో భాగంగా ఆమెనూ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్‌తో పాటు సర్పంచ్‌లు, అధికారులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు కటకం శివకుమార్, తసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీవో పాండు, ఎంపీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్‌రావు

శంకర్‌పల్లి ఫిబ్రవరి 2 : విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్‌రావు హెచ్చరించారు. శుక్రవారం శంకర్‌పల్లి మున్సిపాలిటీలోని ప్రభుత్వ దవాఖానను తనిఖీ చేశారు. రోగులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో దామోదర్, డాక్టర్ రేవతిరెడ్డి పాల్గొన్నారు.

చేవెళ్ల ప్రభుత్వ దవాఖాన తనిఖీ

చేవెళ్లటౌన్, ఫిబ్రవరి 2 : వైద్యులు సమయ పాలన పాటించాలని జిల్లా ఆసుపత్రుల పర్యవేక్షణ అధికారి డాక్టర్. రాజు, డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానను తనిఖీ చేశారు. ఎంత మంది డాక్టర్లు, నర్సులు ఉన్నారని ఆరా తీశారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఆసుపత్రిలో అదనపు గదులు, టాయిలెట్స్ నిర్మాణానికి నిధులు విడుదల చేస్తామన్నారు. రంగారెడ్డి జిల్లాకు కొత్తగా రిక్రూట్‌మెంట్ జరిగిన స్టాఫ్ నర్సుల్లో 438 నర్సింగ్ ఆఫీసర్లు వస్తున్నారన్నారు. స్టాఫ్ నర్సుల పోస్టులను భర్తీ చేస్తామన్నారు. ఆయన వెంట సూపరింటెండెంట్ సోమశంకర్, డాక్టర్ లక్ష్మీకాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

హెల్మెట్ ధరించాలి

షాద్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 2 : రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని శంషాబాద్ డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. రోడ్డు ప్రమాదాల వారోత్సవాల్లో భాగంగా షాద్‌నగర్ ట్రాఫిక్ ఎస్ఐ రవీందర్‌నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండలంలోని ఎలికట్ట గ్రామ శివారులో అదానీ డాటా కన్సర్న్ సౌజన్యంతో ఉచిత హెల్మెట్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లు, పూలు, చాక్లెట్లను అందజేశారు. ట్రాఫిక్ నింబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. కార్యక్రమంలో మోటర్ వైహికల్ ఇన్‌స్పెక్టర్ బాలూనాయక్, అదానీ కంపెనీ ప్రాజెక్ట్ మేనేజర్ రంధన్ కుమార్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్లను అందజేస్తున్న శంషాబాద్ డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి

సైబరాబాద్‌లో ఆపరేషన్ స్మైల్ ఎక్స్

నెల రోజుల్లో 718 మందిని కాపాడిన పోలీసులు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ): వెట్టిచాకిరి నుంచి బాలకార్మికులను విముక్తి చేయడంతో పాటు తప్పిపోయిన పిల్లలను గుర్తించడం, యాచక వృత్తి నుంచి బాలలకు విముక్తి కల్పించడంలో భాగంగా సైబరాబాద్ పోలీసులు గత నెలలో నిర్వహించిన ఆపరేషన్ స్మైల్– ఎక్స్‌లో 718 మంది చిన్నారులను కాపాడారు. ఇందులో తెలంగాణ రాష్ట్రానికి చెందిన 301 మంది బాలురు, 28 మంది బాలికలు ఉండగా., 389 మంది ఇతర రాష్ట్రాలకు చెందిన బాలబాలికలు ఉన్నట్లు ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ విభాగం డీసీపీ సృజన తెలిపారు. సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాష్ మహంతి పర్యవేక్షణలో నిర్వహిస్తున్న ఆపరేషన్ స్మైల్ –ఎక్స్‌లో భాగంగా బాల కార్మికులుగా పనిచేస్తున్న 609 మంది బాలురు, 31 మంది బాలికలకు వెట్టిచాకిరి నుంచి విముక్తి కల్పించామని, దర్పన్ యాప్ ద్వారా తప్పిపోయిన ఒక బాలుడిని గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించినట్లు డీసీపీ వివరించారు. చెత్త సేకరించే 37 మంది పిల్లలకు సైతం విముక్తి కల్పించినట్లు తెలిపారు.

ఉద్యోగాలకు సెలవు పెట్టి

కానిస్టేబుళ్ల గంజాయి దందా

సిటీబ్యూరో, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ): సులభంగా డబ్బులు సంపాదించాలనే దురాశతో ఏపీకి చెందిన ఇద్దరు పోలీసు కానిస్టేబుళ్లు గంజాయి వ్యాపారం చేస్తూ సైబరాబాద్ పోలీసులకు దొరికిపోయారు. బాచుపల్లి ఇన్‌స్పెక్టర్ జె. ఉపేందర్ రావు కథనం ప్రకారం.. విజయనగరం జిల్లాకు చెందిన ఊరుటి సాగర్ పట్నాయక్ (32) కాకినాడలోని ఏపీఎస్పీ 3వ బెటాలియన్‌లో హెడ్ కానిస్టేబుల్. తూర్పు గోదావరికి చెందిన పప్పల శ్రీనివాస్ (35) కూడా అదే బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇరువురు స్థానికంగా చేసే జీడి పప్పు (కాజు) వ్యాపారంలో ఆశించిన ఫలితాలు రాక గంజాయి విక్రయిస్తూ అధిక లాభాలు పొందాలని నిర్ణయించుకున్నారు. ఇద్దరు ఆరోగ్యం బాగాలేదంటూ ఉద్యోగాలకు సెలవు పెట్టారు. స్థానికంగా గంజాయి కొనుగోలు చేసి, గురువారం రాత్రి ఏపీ నుంచి మారుతీ కారులో హైదరాబాద్ తరలించారు. సమాచారం అందుకున్న బాచుపల్లి పోలీసులు ప్రగతినగర్ కమాన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తూ.. అటుగా వచ్చిన ఏపీ కానిస్టేబుళ్ల కారును ఆపి తనిఖీ చేశారు. ఆ కారులో 11 ప్యాకెట్లలో 22 కిలోల గంజాయి లభించింది. దీంతో వారిద్దరినీ అరెస్టు చేశారు. గంజాయితో పాటు కారు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ఉపేందర్‌రావు తెలిపారు.

సురక్షిత ప్రయాణానికి జాగ్రత్తలు తప్పనిసరి

కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ కోటిరెడ్డి

ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో ఎస్పీ కోటిరెడ్డి

ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవు

తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్

తాండూరు, ఫిబ్రవరి 2 : ప్రమాదాల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని వికారాద్ జిల్లా ఎస్పీ కోటిరెడ్డి పేర్కొన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం తాండూరు పట్టణంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వాహనదారులు రోడ్డు నియమాలను పాటించాలని గులాబీ పువ్వులు అందజేస్తూ విస్తృత ప్రచారం చేశారు. చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు, ఆర్టీసీ సిబ్బంది, ఆటో డ్రైవర్లు, ప్రజలు, నేతలు పోలీస్ సిబ్బందితో కలిసి ఇందిరాచౌక్‌లో మానవహారం నిర్మించారు. బాధ్యతతో రోడ్డు నియమాలను పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు సేఫ్టీ గురించి తెలుసుకోవాలన్నారు. దేశంలో ప్రతి నిమిషానికీ ఒక రోడ్డు ప్రమాదం జరుగుతుండగా, ప్రతి మూడు నిమిషాలకు ఒకరు మృత్యువాత పడుతున్నారని తెలిపారు. ఎక్కువ శాతం అధిక వేగంతోనే ప్రమాదాలు చోటుచేసుకొని ప్రాణ నష్టం జరుగుతున్నదన్నారు. వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని, మద్యం సేవించి, హెల్మెట్, సీట్‌బెల్ట్ పెట్టుకోకుండా వాహనాలు నడుపొద్దని సూచించారు. 18 ఏండ్లలోపు పిల్లలకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వరాదని సూచించారు. తాండూరులో ట్రాఫిక్ పోలీసులను నియమించనున్నట్లు వెల్లడించారు. అక్రమ ఇసుకరవాణా, గంజాయి అడ్డుకట్టకు పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఎక్కడైనా అన్యాయం, అక్రమాలు జరిగితే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్ మాట్లాడుతూ ప్రజలు తూచా తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. రోడ్డు నియమాలు పాటించని వారు ఎంతటివారైనా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ లావణ్య, తాండూరు పట్టణ సీఐ సంతోష్‌కుమార్, రూరల్ సీఐ అశోక్, తాండూరు ఆర్టీసీ డిపో మేనేజర్ సమతారెడ్డి, పోలీస్ సిబ్బంది, కౌన్సిలర్లు, నేతలు, విద్యార్థులు, అధ్యాపకులు, ప్రజలు పాల్గొన్నారు.

వాహనదారుడికి గులాబీ పువ్వు ఇస్తూ రోడ్డు నియమాలు పాటించాలని సూచిస్తున్న మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ లావణ్య

అర్హులందరికీ జాబ్ కార్డులు ఇవ్వాలి

అదనపు డీఆర్డీవో స్టీవెన్ నీల్

నవాబుపేట, ఫిబ్రవరి 2 : ఉపాధి హామీ పథకంలో భాగంగా అర్హులందరికీ జాబ్ కార్డులు అందజేయాలని అదనపు డీఆర్‌డీవో స్టీవెన్ నీల్ సూచించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఎంపీడీవో అధ్యక్షతన 14వ విడుత సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు డీఆర్డీవో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2022 ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి 2023 మార్చి 31వ తేదీ వరకు జరిగిన పనుల పూర్తి వివరాలను గ్రామాల వారీగా నివేదికను అందజేయాలని కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. గ్రామాల అభివృద్ధి కోసమే కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని తీసుకొచ్చిందన్నారు. గ్రామాల్లోని కూలీలకు ఈ పథకంపై అవగాహన కల్పించే బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లదేనని అన్నారు. వంద రోజుల పథకం కావడంతో అర్హులందరికీ జాబ్ కార్డులు అందజేసి పనిలో భాగస్వాములను చేయాలని కోరారు. కూలీలు పని చేసే ప్రాంతం, ఎన్ని రోజులు చేశారనే వివరాలు నమోదు చేసేందుకు రిజిస్టర్లను ఉపయోగించాలని తెలిపారు. హరితహారంలో భాగంగా నాటిన మొక్కల ఎదుగుదలకు తప్పనిసరిగా సంరక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. లేనిపక్షంలో ఎలాంటి ఉపయోగం లేకుండా పోతుందని తెలిపారు. మండలంలోని కొన్ని గ్రామాల్లో కూలీల నమోదుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జరిగిన పనులపై గ్రామ సభల్లో తప్పనిసరిగా చర్చించాలన్నారు. అనంతరం పలు గ్రామాల పనులకు సంబంధించి రూ.15వేల పనుల వరకు కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుమిత్రమ్మ, ఏపీవో లక్ష్మీదేవి, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్ల ద్వారా వివరాలు తెలుసుకుంటున్న అదనపు డీఆర్‌డీవో స్టీవెన్ నీల్

మార్చి 18 నుంచి పదో తరగతి పరీక్షలు

జిల్లా విద్యాశాఖ అధికారిని రేణుకాదేవి

వికారాబాద్, ఫిబ్రవరి 2 : మార్చి18 వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారిణి రేణుకాదేవి శుక్రవారం తెలిపారు. 18న ఫస్ట్ లాంగ్వేజ్ తెలుగు, 19న సెకండ్ లాంగ్వేజ్ హిందీ, 21న థర్డ్ లాంగ్వేజ్ ఇంగ్లిష్, 23న గణితం, 26న సైన్స్ మొదటి పేపర్ ఫిజికల్ సైన్స్, 28న సైన్స్ సెకండ్ పేపర్ బయోలాజికల్ సైన్స్, 30న సాంఘిక శాస్త్రం, ఏప్రిల్1న ఓఎస్ఎస్సీ మెయిన్ పేపర్ లాంగ్వేజ్ పేపర్ 1 ఒకేషనల్ థియరీ పరీక్షలు, 2న ఓఎస్ఎస్సీ మెయిన్ పేపర్ లాంగ్వేజ్ సెకండ్ పరీక్షలు జరుగుతాయన్నారు. సైన్స్ మొదటి పేపర్ అనగా ఫిజికల్ సైన్స్ ఉదయం 9:30 నుంచి 11 గంటల వరకు జరుగుతుందని, సైన్స్ సెకండ్ పేపర్ బయోలాజికల్ సైన్స్ ఉదయం 9:30 నుంచి 11 గంటల వరకు జరుగుతుందని మిగతా అన్ని పరీక్షలు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు జరుగుతాయని తెలిపారు. ఈ సంవత్సరం కొత్తగా సైన్స్ సబ్జెక్టు కోసం రెండు రోజులు పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సైన్స్ మొదటి పేపర్ ఒక రోజున రెండో పేపరు మరో రోజున నిర్వహిస్తామని వివరించారు.

సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయడంలో టీఎన్జీవోస్ పాత్ర కీలకం

— మరం జగదీశ్వర్, టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు

మాట్లాడుతున్న టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్వర్

వికారాబాద్, ఫిబ్రవరి 2 : ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో టీఎన్జీవోస్ పాత్ర కీలకమని టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు మరం జగదీశ్వర్ అన్నారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ ఆధ్వర్యంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు మరం జగదీశ్వర్ మాట్లాడుతూ టీఎన్జీవోస్ కార్యవర్గ సమావేశంలో అన్ని సమస్యలపై చర్చించడం జరిగిందన్నారు. టీఎన్జీవోస్ తెలంగాణ ఉద్యమంలో ఉద్యోగులు కీలక భూమిక పోషించారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం టీఎన్జీవోస్ కృషి చేసిందని, టీఎన్జీవోస్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. మ్యానిఫెస్టోలో సైతం ఉద్యోగుల సమస్యలు పెట్టడం, మంత్రి వర్గ సమస్యలు పరిష్కరించడం జరుగుతుందన్నారు. టీఎన్జీవోస్ పార్టీకి తొత్తుగా వ్యవహరిస్తుందని పలువురు అనడం బాధాకరమని, ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ ప్రభుత్వానికి టీఎన్జీవోఎస్ పని చేస్తారని గుర్తు చేశారు. జీవోలను ఇంప్లిమెంట్ చేసే బాధ్యత ఉద్యోగులకు ఉందన్నారు. సమావేశంలో అసోసియేట్ అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, కార్యవర్గ సభ్యులు అజ్మత్ పాషా, నర్సింహులు, రమేశ్, శివకుమార్, రామకృష్ణ, శ్రీదేవి, అరుణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కాలె యాదయ్యను పరామర్శించిన ఎంపీ రంజిత్‌రెడ్డి

ఎమ్మెల్యే కాలె యాదయ్యను పరామర్శిస్తున్న ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి

షాబాద్, ఫిబ్రవరి 2 : ఎమ్మెల్యే కాలె యాదయ్య ఇటీవల అనారోగ్యానికి గురై నగరంలోని యశోద దవాఖానలో చికిత్స తీసుకుంటున్నారు. శుక్రవారం ఢిల్లీలో పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ముగించుకుని హైదరాబాద్ చేరుకున్న చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి శంషాబాద్ విమానాశ్రయం నుంచి నేరుగా దవాఖానకు చేరుకుని ఎమ్మెల్యేను పరామర్శించారు. త్వరగా కోలుకుని ప్రజాసేవలో పాల్గొనాలని ఎంపీ ఆకాంక్షించారు.

సర్పంచుల కృషితోనే గ్రామాల అభివృద్ధి

ధారూరులో సర్పంచులను సన్మానించిన వికారాబాద్ జడ్పీచైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి

ధారూరు, ఫిబ్రవరి 2 : గతంలో గ్రామీణ ప్రాంతాలు అధ్వానంగా ఉండేవని.. సర్పంచ్‌ల కృషితోనే అభివృద్ధిపథంలో ముందున్నాయని వికారాబాద్ జడ్పీచైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్టార్ ఫంక్షన్ హాల్‌లో సర్పంచ్‌ల ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లను ధారూరు ఎంపీపీ విజయలక్ష్మిలతో కలిసి ఆమె సన్మానించారు. అనంతరం జడ్పీచైర్ పర్సన్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల కృషి మరువలేనిదన్నారు. గతంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలు చాలా అధ్వానంగా ఉండేవని.. కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తర్వాతే ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. ప్రగతి పనుల కోసం సర్పంచులు సొంత డబ్బును ఖర్చు చేశారన్నారు. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కొందరు సర్పంచ్‌లు చేసిన తప్పు వల్ల అందరికీ చెడ్డ పేరు వచ్చిందన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ధారూరు ఎంపీపీ విజయలక్ష్మి, ధారూరు ఎంపీడీవో చెన్నారెడ్డి, ఎంపీవో షఫిఉల్లా, బీఆర్ఎస్ పార్టీ నాయకులు వడ్ల నందు, యూనుస్, ఏపీవో సురేశ్‌కుమార్, నాయకులు హన్మంత్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, నందు, యాదయ్య, రాంచంద్రయ్య, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయడంలో టీఎన్జీవోస్ పాత్ర కీలకం

— మరం జగదీశ్వర్, టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు

మాట్లాడుతున్న టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్వర్

వికారాబాద్, ఫిబ్రవరి 2 : ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో టీఎన్జీవోస్ పాత్ర కీలకమని టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు మరం జగదీశ్వర్ అన్నారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ ఆధ్వర్యంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు మరం జగదీశ్వర్ మాట్లాడుతూ టీఎన్జీవోస్ కార్యవర్గ సమావేశంలో అన్ని సమస్యలపై చర్చించడం జరిగిందన్నారు. టీఎన్జీవోస్ తెలంగాణ ఉద్యమంలో ఉద్యోగులు కీలక భూమిక పోషించారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం టీఎన్జీవోస్ కృషి చేసిందని, టీఎన్జీవోస్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. మ్యానిఫెస్టోలో సైతం ఉద్యోగుల సమస్యలు పెట్టడం, మంత్రి వర్గ సమస్యలు పరిష్కరించడం జరుగుతుందన్నారు. టీఎన్జీవోస్ పార్టీకి తొత్తుగా వ్యవహరిస్తుందని పలువురు అనడం బాధాకరమని, ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ ప్రభుత్వానికి టీఎన్జీవోఎస్ పని చేస్తారని గుర్తు చేశారు. జీవోలను ఇంప్లిమెంట్ చేసే బాధ్యత ఉద్యోగులకు ఉందన్నారు. సమావేశంలో అసోసియేట్ అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, కార్యవర్గ సభ్యులు అజ్మత్ పాషా, నర్సింహులు, రమేశ్, శివకుమార్, రామకృష్ణ, శ్రీదేవి, అరుణ పాల్గొన్నారు.

పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి మల్లేశం

వికారాబాద్, ఫిబ్రవరి 2 : పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాల దరఖాస్తు కోసం మార్చి 31 వరకు గడువు ఉన్నది. 2023-24 విద్యా సంవత్సరానికి గానూ జిల్లాలోని వివిధ ప్రైవేటు, ప్రభుత్వ కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు (ఫ్రెష్, రెన్యువల్)కు గాను పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఎన్.మల్లేశం శుక్రవారం తెలిపారు. ఈ-పాస్ వెబ్ సైట్ http://telanganaepass.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పెండింగ్‌లో ఉన్న 2022-23, 2023-24 విద్యా సంవత్సరాల పోస్ట్ మెట్రిక్ హార్డ్ కాపీలు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి వికారాబాద్ జిల్లా కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

తీరొక్క మొక్కలు చూపు తిప్పుకోనివ్వవు..

ఇండోర్..క్రోటన్స్ మొదలుకొని.. బోన్సాయిల వరకు.. ఇలా విభిన్న రకాల మొక్కలు.. కుండీలు.. గార్డెనింగ్ వస్తువులతో పీపుల్స్ ప్లాజాలోని గ్రాండ్ నర్సరీ మేళా ఆకట్టుకుంటున్నది. పచ్చదనం పరుచుకొని.. అందమైన మొక్కలతో ప్రకృతి ప్రేమికులను కట్టిపడేస్తున్నది.